

అన్నదానానికి విరాళం

ఆత్రేయపురం: ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో అన్నదానానికి గోపరాజు శిరీష్, అలేఖ్య దంపతులు (హైదరాబాద్) శనివారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.



రూ.లక్ష విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహ స్వామి సన్నిధిలో నిత్యాన్నదానానికి, నిత్యాభిషేకానికి చెరో రూ.50 వేల చొప్పున ఆర్.నంధ్య, కుటుంబ సభ్యులు శనివారం విరాళం సమర్పించారు.

గరిష్ఠం/కనిష్ఠం
31.0° / 24.5°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	31.0	25.00
కాకినాడ	28.0	24.5
అమలాపురం	30.0	26.0

న్యూస్‌రీల్

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తుని రూరల్: హంసవరంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 7, 8, 9 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ పి.పద్మజ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో నేరుగా ఓసీ, బీసీలు రూ.150, ఎస్సీ, ఎస్టీలు రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో కుల ధ్రువీకరణ పత్రం, స్టడీ, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జెరాక్స్‌లను సమర్పించాలన్నారు. దరఖాస్తుదారులకు ఈ నెల 30న అర్హత పరీక్ష నిర్వహిస్తామన్నారు. పరీక్ష ఆంగ్ల మాధ్యమంలో ఉంటుందన్నారు. తెలుగు, ఇంగ్లిషు, గణితం, విజ్ఞానశాస్త్రం, సాంఘిక శాస్త్రాల్లో ఒక్కొక్క సబ్జెక్టుకు పది చొప్పున మొత్తం 50 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారన్నారు. మెరిట్, రోస్టర్ విధానం ఆధారంగా జిల్లా కమిటీలో ఎంపికైన విద్యార్థులకు అడ్మిషన్లు ఇస్తామన్నారు. ఆరు, ఇంటర్మీడియెట్ మొదట సంవత్సరం విద్యార్థులకు మెరిట్ జాబితా ఆధారంగా అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు.

27న మినీ జాబ్‌మేళా

కాకినాడ సిటీ: జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కాకినాడలోని ఏపీఎస్‌డీసీ జిల్లా కార్యాలయం (డీఆర్‌డీఏ కార్యాలయం) లో ఈనెల 27న మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా అధికారి డి హరిశేషు శనివారం తెలిపారు. యు బ్రాడ్‌బాండ్, విజయవర్మ అండ్ కో కంపెనీలలో సుమారు 50 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదివి, 18 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉన్నవారు అర్హులనానరు. ఎంపికైన అభ్యర్థులకు రూ.13 వేలు నుంచి రూ.18 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. అసక్తిగల అభ్యర్థులు బయోడేటా, ఆధార్, ఐడీ అండ్ అడ్రెస్ ప్రూఫ్, విద్యార్హత సర్టిఫికెట్‌లతో హాజరుకావచ్చని హరిశేషు వివరించారు.


ఆషాఢంలో పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు



తుని డిపోలో అధికారులతో సమీక్షిస్తున్న శ్రీనివాసరావు

తుని: ప్రస్తుత ఆషాఢ మాసంలో పర్యాటక ప్రాంతాలు, పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలని జిల్లా ప్రజారవాణాశాఖ అధికారి ఎం.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. తుని డిపోలోని పలు విభాగాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆషాఢ మాసంలో బస్సు సర్వీసులు తక్కువగా ఉంటాయన్నారు. అరుణాచలం, భద్రాచలం, అరసవిల్లి, విశాఖపట్నం బీచ్, అరకు ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులను నడపడం ద్వారా ఆర్టీసీకి ఆదాయం వస్తుందన్నారు. అన్ని మండలాల్లో కార్గో సేవలను పెంచాలని, ఇందుకు అవసరమైన ఏజెంట్లను నియమించాలని సూచించారు. కోటనందూరు, గొల్ల అప్పారావు సెంటర్లలో బస్ షెల్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. గత నెలలో ఉత్తమ ప్రతిభ చూపిన ఎ.ఈశ్వరుడు, బీవీ కుమారి, రాజారావు, చిన్న, జీఎస్ఎల్ఎన్ రావు, ప్రసాద్‌లను అవార్డులతో సత్కరించారు. డిపో మేనేజర్ టి.కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: ఖరీఫ్ సాగుకు సంబంధించి డెల్టా కాలువలకు శనివారం 5730 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఇందులో తూర్పు డెల్టాకు 1590క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 1140క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 3000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. శనివారం సాయంత్రం కాటన్ బ్యారేజ్ వద్ద 8.55 అడుగులకు నీటి మట్టం చేరింది.

దేశం అవినీతి పంచాయతీ

- వేట్లపాలెంలో దోచుకున్న ప్రజాధనం
- చేయని పనులకు చేసినట్టు రికార్డులు
- సర్పంచ్, ఆమె భర్త మాయాజాలం
- చినరాజప్ప అనుచరులే పాత్రదారులు
- ప్రాథమికంగా అవినీతి లెక్క రూ.4 కోట్లు

సాక్షిప్రతినిధి, కాకినాడ: 'ఆవు చేలో మేస్తుంటే దూడ గట్టున మేస్తుందా' అనే సామెత తెలుగు తమ్ముళ్లకు నూరుశాతం వర్తిస్తుంది. ప్రజాధనాన్ని కొల్లగొట్టడంలో వీరిది అందె వేసిన చెయ్యి. పార్టీ అధినేత చంద్రబాబు దగ్గర నుంచి చోటామోటా నాయకుల వరకు అందరిదీ అదే తీరు. పెద్దాపురం నియోజకవర్గం వేట్లపాలెంలో నిధుల స్వాహాకు టీడీపీ నేత కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారు. జిల్లాలో అతి పెద్ద మేజర్ గ్రామ పంచాయతీ కావడంతో నిధులు కూడా పుష్కలమే. ఇక్కడ టీడీపీ కీలక నేతగా వ్యవహరిస్తోన్న వల్లూరి శ్రీనివాస్ ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు ముఖ్య అనుచరుడు. 2017–2021 వరకు శ్రీనివాస్ భార్య శేషవేణి సర్పంచ్‌గా.. శ్రీనివాస్ ఉపసర్పంచ్‌గా పనిచేశారు. వీరి హయాంలో పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై నిధులను దోచేశారు.

కాగితాల్లోనే పనులు

వేట్లపాలెం పంచాయతీలో జనాభా 20 వేలపైచిలుకు ఉంటుంది. ఏటా జనరల్ ఫండ్ కూడా రూ.కోటి దాటేది. ఆర్థిక సంఘం నిధులు కూడా తోడయ్యాయి. ఇదే అదనుగా ఉన్న సిమెంట్ రోడ్లనే కొత్తగా వేసినట్టు, మంచినీటి ట్యాంకులు శుభ్రం చేసినట్టు, డ్రైన్లలో పూడిక తీసినట్టు కాగితాల్లో చూపించారు. ఇంటి పన్ను, కుళాయి పన్నులు వసూలుచేసి జమచేయకుండానే నొక్కేశారు. బ్లీచింగ్, ముగ్గు, చీపుర్లు కొనుగోలు చేయకుండానే ఆర్థిక సంఘం నిధులు దారి మళ్లించారు. ఇలా వారి హయాంలో ఐదారు కోట్ల రూపాయల మేర అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలున్నాయి. సర్పంచ్ శేషవేణి అయినా ఉప సర్పంచ్ హోదాలో ఆమె భర్త పెత్తనం చేసి నిధులు నొక్కేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు గోలి బాబ్జీ ఫిర్యాదుతో ఇక్కడి అవినీతి బయటపడింది. ఇక్కడ కొల్లగొట్టిన ప్రజాధనంతో అక్రమార్కులు కాకినాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నం ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టారని స్థానికులు ఫిర్యాదు చేశారు.



చంద్రబాబుతో సర్పంచ్ శేషవేణి, ఉపసర్పంచ్ శ్రీనివాస్



పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్పతో సర్పంచ్ శేషవేణి, ఉపసర్పంచ్ శ్రీనివాస్

అధికారులూ భోక్తలే

- వేట్లపాలెం పంచాయతీలో అక్రమాలపై డీఎల్‌పీఓ వై అమ్మాజీ విచారణ నిర్వహించారు.
- పంచాయతీ జనరల్ నిధులు, ఇంటి పన్ను, ఆర్థిక సంఘం నిధులు దారి మళ్లినట్టు ప్రాథమిక విచారణలో తేలింది.
- పంచాయతీ కార్యదర్శి జీవీ రమణ రూ.3.68 లక్షలు అవినీతికి పాల్పడ్డట్టు లెక్క తేలింది.
- పంచాయతీ కార్యదర్శి పీఎస్ఆర్ రాజేశ్వరరావు జనరల్ నిధుల నుంచి రూ.3.61లక్షలు, 14వ ఆర్థిక సంఘం నిధులలో రూ.6.60లక్షలు కాజేశారని బయటపడింది.
- పంచాయతీ సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీ సూర్యకళ ఇంటి పన్ను రూ.2.24 లక్షలు జమ చేయకుండా స్వాహా చేశారు.
- నాటి సర్పంచ్ శేషవేణి జనరల్ ఫండ్స్ రూ.3.61లక్షలు, 14 ఆర్థిక సంఘం నిధుల్లో రూ.6.62 లక్షలు దారి మళ్లించారు
- పంచాయతీలో రూ.25 లక్షల వరకు ప్రజాధనం దారి మళ్లినట్టుగా డీఎల్‌పీఓ తేల్చారు.

ఇవీ చర్యలు

విచారణ అనంతరం జీవీ రమణ సస్పెండయ్యారు. ఆయన తన హయాంలో జరిగిన అవినీతి సొమ్ము పంచాయతీకి జమ చేశారు. పీఎస్ఆర్ రాజేశ్వరరావు రిటైరయ్యారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ నిలిపివేసేలా జిల్లా పంచాయతీ అధికారులు ప్రభుత్వానికి సిఫార్సు చేశారు.

అవినీతి చిట్టా తిరగేస్తే..

ఏడెనిమిది కోట్ల రూపాయల వరకు అవినీతి జరిగితే డీఎల్‌పీఓ మొక్కుబడిగా విచారించి అక్రమార్కుల కొమ్ము కాస్తున్నారని స్థానికులంటున్నారు. వీరు కొన్ని ఆధారాలతో తాజాగా కలెక్టర్ కృతికాశుక్లాకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ స్పందించి 2013 నుంచి రికార్డుల్ని నిశితంగా పరిశీలించి నివేదిక ఇవ్వాలని కాకినాడ రూరల్ డీఎల్‌డీఓ నారాయణమూర్తిని ఆదేశించారు. ఈ క్రమంలో ఆయన శనివారం కలెక్టర్‌కు మధ్యంతర నివేదిక సమర్పించారు. పునర్విచారణలో కీలక ఆధారాలు లభించినట్టు తెలిసింది. ఎడ్లబండి లేకుండానే ఎడ్లబండితో చెత్త సేకరించినట్టు రికార్డులు సృష్టించి లక్షలు కాజేశారని తేల్చారు. నకిలీ రశీదులతో కుళాయి, ఆస్తి పన్నులు సొమ్ము లక్షలు దిగమింగేశారు. పైపులైన్ వేయకుండానే వేసినట్టు, మంచినీటి ట్యాంకులు మరమ్మతుల పేరుతో రూ.2.64 కోట్లు కొట్టేశారని సమాచారం. ఉన్న సీసీ రోడ్లపై మరోసారి రోడ్లు వేసినట్టు చూపించి వరసుగా రూ.27.50 లక్షలు, రూ.17.50 లక్షలు, రూ.21 లక్షలు, రూ.26 లక్షలు, రూ.33.90 లక్షలు కాజేశారని భోగట్టా.

పనులపై ఆరా

కాగితంపై సంతకాలు చేసి ఇచ్చే ఓచర్లు 79కి గాను 59 రికార్డుల నుంచి మాయమయ్యాయి. ఎస్సీ పేటలో ఇంటర్నల్ గ్రావెల్ రోడ్డు, జేసీబీతో పారిశుధ్య పనులు , కెనాల్‌రోడ్డులో గోదావరి కాలువ నుంచి చెరువులు నింపినట్టు, కన్నయ్యకాలనీలో ఇంటర్నల్ గ్రావెల్ రోడ్డు వేసినట్టు, సాయిబాబా గుడి నుంచి పంచాయతీ కార్యాలయం వరకు రక్షిత మంచినీటి పైపులైన్ తదితర పనులు చేసినట్టు చూపించి రూ.50లక్షలు పైనే పక్కదోవపట్టించారు. వీటిలో ఏ ఒక్క పనినీ నగదు పుస్తకంలో నమోదు చేయలేదు. ఏ ఒక్క పనికి రికార్డులు కూడా లేవు. అసలు ఈ పనులు చేశారా లేదా అనే కోణంలో క్వాలిటీ కంట్రోల్ యంత్రాంగం ఆరా తీస్తోంది. ఈ రకంగా సర్పంచ్, ఆమె భర్త శ్రీనివాస్ హయాంలో రూ.4 కోట్ల వరకు అవినీతి జరిగినట్టు మధ్యంతర నివేదికలో నిర్ధారించారు. ఈ వ్యవహారాల్లో బాధ్యులైన ఇద్దరిపై క్రిమినల్ కేసులు నమోదుచేసేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది.

బాధ్యులపై క్రిమినల్ చర్యలు



వేట్లపాలెం గ్రామ పంచాయతీలో అక్రమాలు వాస్తవమేనని ప్రాథమిక విచారణలో తేలింది.సమగ్ర విచారణ జరుపుతున్నాం. మధ్యతర నివేదిక ప్రకారం ఇంతవరకు రూ.4 కోట్ల మేర అవినీతి జరిగింది. నాలుగైదు రోజుల్లో పూర్తి స్థాయి నివేదిక వస్తుంది. పంచాయతీలో పలు పనులకు రికార్డులు కూడా లేవు. గత విచారణలో తేలిన దాని కంటే ఎక్కువగానే అక్కడ నిధులు దుర్వినియోగం జరిగినట్టు తాజాగా బహిర్గతమైంది. ఇందుకు బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటాం.

– కృతికాశుక్లా, కలెక్టర్

నాన్నమ్మ మందలించిందని ఆత్మహత్య

కాకినాడ రూరల్: నాన్నమ్మ మందలించిందని పదో తరగతి విద్యార్థిని పెమ్మాడి రూతు (15) ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడింది. తూరంగి మహాలక్ష్మి నగర్‌లో శుక్రవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. స్కూల్‌కు వెళ్లకుండా ఫ్రెండ్ ఇంటికి వెళ్లిపోయిందని, ఇంటిలో పనిచేయడం లేదని నాన్నమ్మ శుక్రవారం మందలించింది. దీంతో రూతు మనస్తాపానికి గురైంది. శుక్రవారం రాత్రి మేడపై గదిలోకి వెళ్లింది. స్నానానికి వెళ్లిందని తండ్రి భావించాడు. ఎంతకు రాకపోవడంతో పైకి వెళ్లి చూసేసరికి ఆమె ఉరి వేసుకుని కనిపించింది. వెంటనే కిందికి దించి ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు., విద్యార్థిని మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నాగరాజు తెలిపారు.

జూలై 4నుంచి డీసెట్ కౌన్సెలింగ్

రాజమహేంద్రవరం రూరల్: ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ డిప్లమో కోర్సు ప్రథమ సంవత్సరంలో చేరేందుకు డీసెట్-2023లో అర్హత పొందిన అభ్యర్థులకు జూలై 4 నుంచి కౌన్సెలింగ్ జరుగుతుంది. బొమ్మూరులోని జిల్లా విద్యాశిక్షణాసంస్థ(డైట్) ప్రిన్సిపల్ డా.ఎస్‌డీవీ రమణ ఈమేరకు ఓప్రకటనలో తెలిపారు. 7వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ నమోదు, 8 నుంచి 13 వరకు సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. 14 నుంచి ప్రావిజనల్ అడ్మిషన్ లెటర్స్ జారీ చేస్తారన్నారు. 15 నుంచి 20 వరకు బొమ్మూరు డైట్‌లో అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో వెరిఫికేషన్ కి హాజరుకావాలన్నారు. ఫీజు చెల్లించి ఫైనల్ అడ్మిషన్ లెటర్ తీసుకుని సంబంధిత కాలేజీలో చేరాల్సి ఉంటుందని ప్రిన్సిపల్ వివరించారు.

బాలబాలాజీ స్వామికి రూ.1.98 లక్షల ఆదాయం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారిని శనివారం 3,275 మంది భక్తులు దర్శించుకున్నారు. వారి గోవింద నామోచ్చారణతో ఆలయ ప్రాంగణం ప్రతిధ్వనించింది. పవిత్ర వైనతేయ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఆలయం చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేశారు. స్వామి వారికి ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. తలనీలాలు సమర్పించారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1.48 లక్షలు, నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలుగా రూ.50,478 కలిపి స్వామివారికి మొత్తం రూ.1,98,478 ఆదాయం సమకూరింది.

రాష్ట్రస్థాయి పెంటాథలాన్ పోటీలు ప్రారంభం



రన్నింగ్ విభాగంలో పోటీ పడుతున్న క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా మోడరన్ పెంటాథలాన్ సంఘం ఆధ్వర్యంలో శనివారం జిల్లా క్రీడామైదానంలో రాష్ట్రస్థాయి పెంటాథలాన్ పోటీలు ప్రారంభమయ్యాయి. పెంటాథలాన్ రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి వెంకటేశ్వరరావు, డీఎస్ఏ చీఫ్‌కోచ్ శ్రీనివాస్ కుమార్‌లు జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను నిరూపించుకోవాలన్నారు. లేజర్ రన్, స్విమ్మింగ్ రన్నింగ్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పెంటథలాన్ పోటీలకు కాకినాడ వేదిక కావడం సంతోషంగా ఉందన్నారు. వివిధ జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో పోటీలలో రాణించాలని కోరారు. రెండు రోజుల పాటు జరిగే ఈపోటీలకు 9 జిల్లాల నుంచి 200మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నిర్వహణా కార్యదర్శి కోటపాడు కృష్ణ, జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి ప్రసాద్, జిల్లా కోచ్ కట్టా జగన్‌మోహన్ కిషోర్, ఉపేంద్రనాథ్, మద్దా వికాష్, పైల అనంత కుమార్, వి.వెంకటరమణ, విశాఖ నుంచి ఎల్లాజీ,రాజేష్, చిత్తూరు నుంచి మురళీ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో మరింతమందికి పథకాల ఫలాలు

మంత్రి రాజా, ఎంపీ వంగా గీత

తుని: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏపథకం లేదా కార్యక్రమమైనా దూరదృష్టితో రూపకల్పన చేస్తారని రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. , ఇలాంటిదే జగనన్న సురక్ష కార్యక్రమం అన్నారు. శనివారం తుని పట్టణం తాళ్లూరు రైల్వేగేటు వద్ద రూ.4.77 కోట్లతో నిర్మించిన ఆర్‌యూబీని ఎంపీ వంగా గీతతో కలిసి ప్రారంభించారు. తుని ప్రజల దశాబ్దాల కల సాకారం అయ్యిందని, ప్రజలకు మేలు చేయడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబాన్ని గుర్తించి సంక్షేమ పథకాల ఫలాలు అందజేయాలనేదే సురక్ష కార్యక్రమం ఉద్దేశమన్నారు. నెల రోజుల పాటు జరిగే కార్యక్రమం ద్వారా వంద శాతం ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు.



తుని పట్టణంలో ఆర్‌యూబీ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా, ఎంపీ వంగా గీత

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా...

ఎంపీ గీత మాట్లాడుతూ ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉండేందుకు జిల్లాలో 3 ఆర్‌యూబీలు, 4 ఆర్వోబీలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను కృషితో తుని పట్టణంలో రూ.4.77 కోట్లతో నిర్మించిన ఆర్‌యూబీ ప్రజలకు అందుబాటులోకి రావడం సంతోషంగా ఉందన్నారు. రైల్వేగేట్లు వలన తరచు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని, భవిష్యత్‌లో గేట్లు ఉండవన్నారు. అన్నవరం, సామర్లకోట, పిఠాపురంలో ఆర్వోబీలు, ఆర్‌యూబీలు నిర్మాణానికి రూ.45 కోట్లు మంజూరు చేశామన్నారు. తుని పరిసర ప్రాంత ప్రజల చిరకాల వాంఛ నేరవేరిందన్నారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు ఆశీర్వాదం ఇవ్వాలని ఆమె కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు,వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వర్దినీడి సుజాత, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, ఎంపీపీ బొప్పనరాము, తుని పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు రేలంగి రమణాగౌడ్, పోతల రమణ, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, కౌన్సిలర్లు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

జేకేసీ అర్జీలకు సంతృప్తికర పరిష్కారం

కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: జగనన్నకు చెబుదాం(జేకేసీ) కార్యక్రమం కింద అందిన అర్జీలకు నాణ్యమైన, సంతృప్తికర పరిష్కారం అందించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. శనివారం అమరావతి నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్, జేసీలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి పాల్గొన్న అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో ప్రారంభించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ప్రాధాన్యత భవనాలైన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల నిర్మాణాల పూర్తికి వారంవారం లక్ష్యాలను నిర్దేశించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్లు క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం రెండవ దశలో ద్వారా చేపట్టిన రీ సర్వే పనులు నిర్దేశింత గడువులోపు పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు లక్ష్యాల సాధనకు అధికారులు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈవో ఎ రమణారెడ్డి, సీపీవో పి త్రినాథ్, డీఎంఅండ్‌హెచ్‌వో ఆర్ రమేష్, పిఆర్ ఎస్‌ఈ ఎం శ్రీనివాసు, సర్వే ఏడీ బి లక్ష్మీనారాయణ, ఏపీఈపీడీసీఎల్ ఈఈ ప్రసాద్, డ్వామా పీడీ ఎ వెంకటలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఎం శ్రీనివాసు, కాకినాడ, పెద్దాపురం డీఎల్డీవోలు నారాయణమూర్తి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సీఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ ఇలక్కియ

క్లుప్తంగా

శివసదన్‌కు రూ.10 లక్షల విరాళం



దాతలు గురుపరన్, శాంతి దంపతులు

అన్నవరం: సత్యగిరిపై నిర్మిస్తున్న శివసదన్ సత్రంలో ఒక గది నిర్మాణానికి చెన్నైకి చెందిన పీఎస్ కుమార గురుపరన్, శాంతి దంపతులు రూ.10 లక్షల విరాళం అందజేశారు. దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ శనివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఈ మొత్తాన్ని తమ కుమారుడు సంతాన రాజగోపాల్ జ్ఞాపకార్థం రూమ్ డోనార్ స్కీమ్ కింద బ్యాంకులో డిపాజిట్ చేసి, నిబంధనల ప్రకారం ఏటా తమకు ఆ సత్రంలో బస, దాతలకు ఇచ్చే గౌరవ మర్యాదలు కల్పించాలని వారు కోరారని ఈఓ వివరించారు.

కుమారుని స్మృత్యర్థం..

కాగా, దాత గురుపరన్, శాంతి దంపతులు అన్నవరం దేవస్థానానికి ఇప్పటికే రూ.40 లక్షల మేర విరాళాలు సమర్పించారు. కుమారుని పేరిట అన్నదానానికి 2021 జూన్ 24న రూ.10 లక్షలు, అదే సంవత్సరం డిసెంబర్ 14న సత్యదేవునికి బంగారు కిరీటం చేయించేందుకు రూ.10 లక్షలు, గత ఏడాది అక్టోబర్ పదో తేదీన అన్నదాన పథకానికి మరో రూ.20 లక్షల చొప్పున విరాళాలుగా ఇచ్చారు. దాత దంపతుల కుమారుడు కాగ్నిజెంట్ టెక్నాలజీ కంపెనీలో సీనియర్ అసోసియేట్‌గా పని చేస్తూ ప్రమాదానికి గురై 2019 నవంబర్ 2వ తేదీన మృతి చెందారు. అప్పటి నుంచీ తమ బిడ్డ జ్ఞాపకార్థం గురుపరన్ దంపతులు వివిధ పథకాలకు విరాళాలు సమర్పిస్తున్నారు. వీరిని మహారాజ పోషకులుగా గుర్తించి, గౌరవించనున్నామని ఈఓ అజాద్ తెలిపారు.

శతాధిక వృద్ధుడి మృతి



విసరపు అబ్బాయి (పాత చిత్రం)

పిఠాపురం: పట్టణంలోని కత్తులగూడెం ప్రాంతానికి చెందిన శతాధిక వృద్ధుడు విసరపు అబ్బాయి అలియాస్ వెంకట్రావు (102) శనివారం మృతి చెందాడు. ఆయనకు ఐదుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఐదేళ్ల క్రితం మృతి చెందింది. చనిపోయేంత వరకూ ఆయన ఆరోగ్యంగా ఉన్నట్టు బంధువులు తెలిపారు.



సదస్సులో మాట్లాడుతున్న ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ చైర్మన్ కిరణ్ కుమార్



సదస్సులో పాల్గొన్న నిరుద్యోగులు

శిక్షణతోనే భవితకు నిచ్చెన

- సాధనతోనే విజయం
- ప్రణాళికతో చదివితేనే కొలువు
- విద్యావేత్తల సూచన
- ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి త్వరలోనే నోటిఫికేషన్
- సాక్షి మీడియా గ్రూప్, ఆర్‌సీ ఎగ్జామ్స్ ఆధ్వర్యాన గ్రూప్–2 ఉద్యోగాల సాధనపై అవగాహన సదస్సు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): చక్కని ప్రణాళికతో చదివితే కోరుకున్న కొలువు సులువుగా సాధించవచ్చని పలువురు విద్యావేత్తలు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో పెద్ద ఎత్తున గ్రూప్–2 పోస్టులు భర్తీ చేయనున్న నేపథ్యంలో 'సాక్షి' మీడియా గ్రూప్, ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ (హైదరాబాద్) ఆధ్వర్యాన శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కాకినాడ దంటు కళాక్షేత్రంలో జరిగిన ఈ సదస్సుకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న గ్రూప్–1, గ్రూప్–2 వంటి పోస్టులు వెయ్యికి పైగా భర్తీ చేసేందుకు ప్రభుత్వం త్వరలో చర్యలు తీసుకుంటుందని అధ్యాపకులు ఈ సందర్భంగా చెప్పారు. పరీక్ష విధానం, మారిన సిలబస్, విద్యార్థుల సన్నద్ధతపై అధ్యాపకులు డాక్టర్ కరీం (హిస్టరీ), సి.హరికృష్ణ (సైన్స్ అండ్ టెక్నాలజీ), ఎండీ పాషా (ఎకానమీ), బి.కృష్ణారెడ్డి (పాలిటీ) అవగాహన కల్పించారు. తొలుత ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ చైర్మన్ మొండెం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో వివిధ సబ్జెక్టుల్లో నిష్ణాతులైన లెజండరీ ఫ్యాకల్టీలతో కరోనా సమయంలో తాము ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించామని చెప్పారు. తమ సంస్థ ద్వారా ఆన్‌లైన్‌లో 25 వేల మంది నిరుద్యోగులు శిక్షణ పొందారని, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో వేలాది మంది ఉద్యోగాలు సాధించారని తెలిపారు. అనంతరం సదస్సుకు హాజరైన వారికి పరీక్ష నిర్వహించి స్కాలర్‌షిప్‌లు అందజేశారు. కార్యక్రమంలో నాయుడు స్టడీ సర్కిల్ నాయుడు, 'సాక్షి' బ్యూరో చీఫ్ ఎల్.శ్రీనివాసరావు, యాడ్స్ మేనేజర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పోటీ పరీక్షలో మొదటి స్థానం విజేత వరప్రసాద్‌కు స్కాలర్‌షిప్ అందిస్తున్న అతిథులు

గ్రూప్–2కు అత్యుత్తమ శిక్షణ



పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారి కోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఆర్‌సీ ఎగ్జామ్స్ ద్వారా రాష్ట్రంలోనే అత్యుత్తమ శిక్షణ అందిస్తున్నాం. మా సంస్థలో అత్యుత్తమ ఫ్యాకల్టీలు బోధిస్తున్నారు. ఈ నెలలో ఏపీ గ్రూప్–2 బ్యాచ్‌కు అడ్మిషన్లు ప్రారంభించాం. హైదరాబాద్ రాలేని గృహిణులు, ప్రైవేటు ఉద్యోగులకు మొబైల్ యాప్ ద్వారా తెలుగు, ఇంగ్లిష్ మీడియాల్లో శిక్షణ ఇస్తున్నాం. వివరాలకు 89850 93399, 89850 94499 నంబర్లలో సంప్రదించవచ్చు.

– మొండెం కిరణ్‌కుమార్, చైర్మన్, ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ, హైదరాబాద్

భవితకు భరోసా



నేను సివిల్స్ రాసి ఇంటర్వ్యూ వరకూ వెళ్లాను. గ్రూప్–1 ఉద్యోగం సాధించి రిజిస్ట్రేషన్ శాఖలో పని చేశాను. టీచింగ్‌పై మక్కువతో మూడు దశాబ్దాలుగా హిస్టరీ బోధకుడిగా పని చేస్తున్నాను. తెలంగాణ, ఢిల్లీ, బెంగళూరు, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చాను. కోవిడ్ సమయంలో పోటీ పరీక్షలకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాం. ఆర్‌సీ ఎగ్జామ్స్ పేరుతో వేలాది వీడియోలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశాం.

– డాక్టర్ ఎం.అబ్దుల్ కరీం, హిస్టరీ ఫ్యాకల్టీ

ఆత్మ విశ్వాసం పెంచింది



గ్రూప్–2 పోటీ పరీక్షల్లో విజయ సాధనకు అభ్యర్థులు చేయాల్సిన కృషి, పాటించాల్సిన మెళకువలపై నిష్ణాతులైన ఫ్యాకల్టీలు చక్కగా మార్గనిర్దేశం చేశారు. ఇది మా ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. పోటీ పరీక్షలకు తొలిసారిగా హాజరయ్యే వారు సైతం తక్కువ సమయంలో ఎలా విజయం సాధించవచ్చనే అంశాలను అర్థమయ్యేలా చక్కగా వివరించారు.

– డి.నాగకృష్ణ, బీకాం

'సాక్షి'కి కృతజ్ఞతలు



గ్రూప్–2 ఉద్యోగం సాధించాలంటే ఎలాంటి వ్యూహాలు అనుసరించాలో ఈ సదస్సు ద్వారా అవగతమైంది. ఏయే సబ్జెక్టులపై ఎలా ఫోకస్ చేయాలనే అంశాలపై స్పష్టత వచ్చింది. ప్రిలిమినరీ, మెయిన్స్ రెండింటికీ ఒకే దఫా ఎలా సన్నద్ధం కావాలో అంచనా ఏర్పడింది. ఈ సదస్సు ఏర్పాటు చేసిన 'సాక్షి' మీడియాకు కృతజ్ఞతలు.

– కె.జ్ఞానానాగేశ్వరి, కాకినాడ

విభిన్న ఆలోచనలతో సన్నద్ధం కావాలి



పోటీ పరీక్షలకు లక్షల మంది దరఖాస్తు చేస్తారు. వీరిలో తక్కువ మందికి మాత్రమే గ్రూప్ సిలబస్‌పై అవగాహన ఉంటుంది. ఇందులో అంశాల పరిధిని చాలా విస్తృతంగా చదవాలి. ప్రశ్నల సరళిలో చాలా మార్పులు చేశారు. ప్రతి అంశంపై చాలా లోతుగా ఆలోచించాలి.

– బి.కృష్ణారెడ్డి, పాలిటీ ఫ్యాకల్టీ

సైన్స్ అండ్ టెక్నాలజీ కీలకం



ఏపీపీఎస్సీ మూడు నెలల క్రితమే గ్రూప్స్ సిలబస్‌లో మార్పులు చేసింది. ఇందులో సైన్స్ అండ్ టెక్నాలజీ అనేది కీలకం. దీనిని కరెంట్ అఫైర్స్‌లో భాగంగా పరిగణించాలి. ఇస్రో పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలు, ఉపగ్రహ ప్రయోగాల వంటి వాటిపై దృష్టి పెట్టాలి. ఇందులో ఏయే టాపిక్ నుంచి ఎన్ని మార్కులు వస్తాయో కూడా అవగాహన ఉండాలి.

– సి.హరికృష్ణ, సైన్స్ అండ్ టెక్నాలజీ ఫ్యాకల్టీ

సమయం ప్రధానం



పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారు చక్కని ప్రణాళిక వేసుకుంటే విజయం సాధ్యమవుతుంది. పోటీ పరీక్షల్లో సమయం చాలా ప్రధానం. ఎకానమీపై గతంతో పాటు వర్తమాన అంశాలను కూడా గూగుల్‌లో ఎప్పటికప్పుడు చూస్తుండాలి. నోటిఫికేషన్ కోసం ఎదురు చూడకుండా నిరంతరం శ్రమించాలి. నోటిఫికేషన్ వచ్చాక కేవలం క్లిష్టమైన అంశాలపై దృష్టి పెట్టాలి.

– ఎండీ పాషా, ఎకానమీ ఫ్యాకల్టీ

స్ఫూర్తి కలిగించారు



అభ్యర్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు స్ఫూర్తిని కలిగించారు. ప్రణాళికాబద్ధమైన సాధనతోనే విజయం సాధ్యమవుతుందని ఉదాహరణలతో చెప్పిన తీరు అద్భుతం. గ్రూప్స్‌కు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఇది మంచి వరం.

– ఎస్.సూర్య, బీఎస్సీ

సాధనకు దిక్సూచి



ఉన్నత కొలువులు సాధించేందుకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఈ అవగాహన సదస్సు దిక్సూచిలా ఉపకరిస్తుంది. ఇలాంటి కార్యక్రమాలు 'సాక్షి' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి, నిరుద్యోగుల అభ్యున్నతికి దోహదపడాలి.

– టి.సంతోషి, బీఏ

ప్రమాదం కాదు.. హత్యే..

కాకినాడ రూరల్: మద్యం తాగిన సమయంలో జరిగిన వివాదం ఓ వ్యక్తి ప్రాణం తీసింది. ఈ కేసు నిందితులను 48 రోజుల తరువాత పోలీసులు అరెస్టు చేశారు. ఇంద్రపాలెం ఎస్సై నాగరాజు కథనం ప్రకారం.. తూరంగి పగడాలపేట వద్ద గత నెల 4 రాత్రి గుర్తు తెలియని ఆటో ఢీకొని అదే ప్రాంతానికి చెందిన సంగాడి శివ (42) మృతి చెందాడు. అప్పట్లో పోలీసులు గుర్తు తెలియని ఆటో ఢీకొని మృతి చెందినట్టుగానే కేసు నమోదు చేశారు. అయితే మృతుడు శివకు, కొంతమందికి కరప మండలం ఉప్పలంక జాతర వద్ద గొడవ జరిగినట్టు కుటుంబ సభ్యులు తెలుసుకున్నారు. అలాగే పగడాలపేటకు చెందిన తరికి రారాజు కనిపించడం లేదని కూడా గమనించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యాన విచారణ చేపట్టారు. జాతరలో మద్యం తాగిన సమయంలో జరిగిన గొడవ కారణంగా శివను కావాలనే ఆ రోజు రాత్రి రారాజు, మరో వ్యక్తి జాన్‌ప్రసాద్ ఆటోతో ఢీకొని హత్య చేశారని నిర్ధారించారు. పోలీసు విచారణ నేపథ్యంలో రారాజు, జాన్‌ప్రసాద్ ఇంద్రపాలెం పోలీసులకు లొంగిపోయారు. వారిని అరెస్టు చేసి, శనివారం రిమాండుకు తరలించారు. కోటనందూరు మండలం కొత్తపట్నానికి చెందిన రారాజు పగడాలపేటలో అత్తవారింటి వద్ద ఉంటున్నాడని ఎస్సై చెప్పారు.

చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం

- 'నన్నయ' వీసీ ఆచార్య పద్మరాజు
- ముగిసిన రీజినల్ స్పోర్ట్స్‌మీట్

రాజానగరం: చదువుతో పాటు క్రీడలకు కూడా ఆదికవి నన్నయ యూనివర్సిటీ తగిన ప్రాధాన్యం ఇస్తూ, క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని ఉప కులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. వర్సిటీలో రెండు రోజుల పాటు జరిగిన గోదావరి క్లస్టర్ అంతర్ విశ్వవిద్యాలయాల రీజినల్ స్పోర్ట్స్‌మీట్ శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో జేఎన్‌టీయూకే ఉప కులపతి ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజుతో కలిసి 'నన్నయ' వీసీ పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను అభినందించారు. క్రీడాస్ఫూర్తితో పయనిస్తూ ఎంచుకున్న లక్ష్యాలను సాధించే దిశగా ముందంజ వేయాలని సూచించారు. స్టేడియంలో రూ.8.50 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో స్విమ్మింగ్‌పూల్, ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. జేఎన్‌టీయూకే వీసీ ఆచార్య ప్రసాదరాజు మాట్లాడుతూ, క్రీడలు శరీర దారుఢ్యానికే కాకుండా మేధోసంపత్తి వృద్ధికి తోడ్పడతాయని అన్నారు. తొలుత విజేతలకు ఇద్దరు వీసీలూ బహుమతులు అందజేశారు.

వీరే విజేతలు

బాస్కెట్‌బాల్ మహిళల విభాగంలో 'నన్నయ', పురుషుల విభాగంలో జేఎన్‌టీయూకే విజేతలుగా నిలిచాయి. కబడ్డీ పురుషుల విభాగంలో జేఎన్‌టీయూకే, మహిళల విభాగంలో 'నన్నయ', వాలీబాల్ (పురుషులు, స్త్రీ విభాగాలు) 'నన్నయ', చెస్ మెన్స్ విభాగంలో జేఎన్‌టీయూకే, వుమెన్స్ విభాగంలో 'నన్నయ' విజేతలుగా నిలిచాయి. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఈసీ సభ్యుడు డాక్టర్ బి.జగన్‌మోహన్‌రెడ్డి, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ ఆచార్య కె.రమణేశ్వరి, నన్నయ, జేఎన్‌టీయూకే క్రీడా కార్యదర్శులు బి.రామ్‌గోపాల్, జి.శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న వీసీలు ఆచార్య పద్మరాజు, ఆచార్య ప్రసాదరాజు

